ఈనాడు

**4th February, 2023**

# సామాన్యులకు సాంకేతిక ఫలాలు అందినప్పుడే సార్థకత

## ☛ కేంద్ర భూపరిశోధన మంత్రిత్వశాఖ కార్యదర్శి రవిచంద్రన్



శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న రవిచంద్రన్, రాధాకృష్ణన్

నిజాంపేట, న్యూస్‌టుడే: సామాన్యులకు సాంకేతిక ఫలాలు అందినప్పుడే వాటికి సార్థకత కలుగుతుందని కేంద్ర భూపరిశోధన మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం. రవిచంద్రన్ అన్నారు. హైదరాబాద్ శివారు ప్రగతినగర్‌లోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఇన్‌కాయిస్) 24వ వార్షికోత్సవాలు శుక్రవారం ఆరంభమయ్యాయి. ఈ కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మానవ జీవన విధానంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా శాస్త్రవేత్తలు కృషి చేయాలని సూచించారు. 'స్పేస్ కమీషన్' మాజీ ఛైర్మన్ డాక్టర్ కె. రాధాకృష్ణన్, డీఎస్‌టీ కార్యదర్శి డాక్టర్ ఎస్. చంద్రశేఖర్, ఇన్‌కాయిస్ డైరెక్టర్ తుమ్మల శ్రీనివాసకుమార్, మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎస్‌సీ షేనాయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన 'నేషనల్ గ్లైడర్ ఆపరేషన్స్, ఈ-క్లాస్‌రూం, ఓషియన్-3 డాటా అక్విజైషన్ అండ్ ప్రాసెసింగ్, మెరైన్ హీట్ వేవ్ సర్వీస్' విభాగాలను ఆహూతులు వరుసగా ప్రారంభించారు. కార్యక్రమ ఆఖరులో ఇన్‌కాయిస్ కార్యకలాపాలపై రూపొందించిన ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించారు. ఏడాది పొడవునా ఈ వేడుకలు జరుగుతాయని, వచ్చే ఏడు సిల్వర్ జూబ్లీ ఉత్సవాలతో ముగుస్తాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు.